క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: హెచ్‌పీఎస్, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బేగంపేట తాతాచారికాలనీ, బొంబే హల్వా కాంపౌండ్, పోచమ్మ బస్తీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, వాణి ప్రింటర్స్ ఏరియా, హెచ్‌పీఎస్ స్కూల్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గురుమూర్తిలేన్, తాతాచారి కాలనీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, బొంబే హల్వా కాంపౌండ్, అమృత మాల్, ఐసీఐసీఐ బ్యాంక్, జయాగార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసులు



పద్మారావునగర్: చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తిమ్మప్ప బదిలీపై వెళ్లగా నేరేడ్‌మెట్ స్టేషన్ సీఐగా పనిచేసిన సీహెచ్. శ్రీనివాసులు చిలకలగూడ ట్రాఫిక్ స్టేషన్‌కు వచ్చారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యచరణతో ముందుకు సాగుతామని, రోడ్లపై ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా శ్రీనివాసులు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మందులు అందిస్తున్న హేమ

చిలకలగూడ: సీజనల్ వ్యాధులపై ప్రజలతో పాటు వైద్యసిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్ బ్లాక్‌పార్కు, ఉప్పరిబస్తీ బీసీ గరల్స్ హాస్టల్ ప్రాంగణాల్లో చిలకలగూడ యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్పొరేటర్ హేమ మాట్లాడుతూ.. వర్షాకాలంలో జ్వరం, రొంప, జలుబు వంటి సీజనల్ వ్యాధులు త్వరితగతిన వ్యాప్తి చెందుతాయని, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతో వీటికి నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలోవైద్యురాలు ఫణి, గీత, శిరీష, మంజుభార్గవి పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరని లోటు

అడ్డగుట్ట: ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులికల్పన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెతుకు సీమలో దళిత కుటుంబంలో పుట్టి తన ఆట పాటలతో ప్రపంచ గుర్తింపు సాధించిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. నాటి చంద్రబాబు ప్రభుత్వం తుటాలతో చంపేందుకు యత్నించగా ప్రజాయుద్ధ పాటకు చావులేదని ప్రపంచం చాటిందని గుర్తు చేశారు. దళిత, బహుజనులకు రాజ్యాధికార సాధనే గద్దర్‌కు నిజమైన నివాళి అన్నారు.

డిప్యూటీ స్పీకర్ సంతాపం..

చిలకలగూడ : గద్దర్ మృతి పట్ల డిప్యూటీ స్పీకర్ టీ పద్మారావుగౌడ్ సంతాపం ప్రకటించారు. గద్దర్ అకాల మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని ప్రజా గాయకుడిగా లక్షలాది మంది జీవితాల్లో చైతన్యం రగిల్చిన గద్దర్ లేరనే వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందనారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరపాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గద్దర్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికార లాంఛనాలతో జరపాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర అధ్యక్షులు అంగిరి ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మంచాల లింగస్వామి కోరారు. గద్దర్ మృతికి సంతాపం తెలిపి మాట్లాడారు. సామాజిక ఉద్యమానికి గద్దర్ లేని లోటు తీర్చలేమన్నారు. గద్దర్ కాంస్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై స్థాపించాలన్నారు.

ఓఎస్‌డీ శ్రీధర్ సేవలు మరువలేనివి



శ్రీధర్ చిత్రపట వద్ద నివాళి అర్పించిన వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ఎనర్జీ సెక్రటరీకి ఓఎస్‌డీగా పని చేస్తున్న దివంగత ఇంజినీర్ టి.శ్రీధర్ సంతాప సభ పూర్వవిద్యార్థుల సంఘం (అలూమ్ని) ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ హాజరై శ్రీధర్ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి 1986లో బీఈ పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్నత పదవిలో కొనసాగడం ఓయూకు గర్వకారణమన్నారు. పూర్వ విద్యార్థిగా శ్రీధర్ ఇంజినీరింగ్ కాలేజీకి ఎంతో చేశారని ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ కొనియాడారు. అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ విజయ్‌కుమార్, సెక్రటరి డాక్టర్ వెంకట్‌రామయ్య, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం. ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొ.మంగు పాల్గొన్నారు.



- బన్సీలాల్‌పేట్‌లో ఘనంగా బోనాల వేడుకలు
- భక్తిశ్రద్ధలతో ఫలహార బండ్ల ఊరేగింపు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

బైలెల్లిన బోనం.. అమ్మకు సమర్పణం



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన బోనాలతో ఆధ్యాత్మిక వాతావరణ సంతరించుకుంది. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, భోలక్‌పూర్, ఐడీహెచ్ కాలనీ, బండమైసమ్మనగర్, చాచానెహ్రూనగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో అమ్మవారి బోనాల సంబరాలు అంబరాన్ని తాకాయి. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ పార్టీల నాయకులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ వెంగళరావునగర్‌లోని ఉప్పలమ్మ దేవాలయం, ఇందిరానగర్ కట్టమైసమ్మ తదితర దేవాలయాల్లో పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారికి బోనం, సాక సమర్పించారు. నార్త్‌లాలాగూడ రైల్వే క్వార్టర్స్‌లోని రేణుకా ఎల్లమ్మ, నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణం, మారేడుపల్లిలోని ప్రముఖ న్యూక్లబ్‌లో బోనాల జాతర వైభవంగా కొనసాగింది.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



ప్రత్యేక పూజలు చేసిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



చాచా నెహ్రూనగర్ దేవాలయంలో శశిధర్‌రెడ్డి



బోయిగూడలో..



పూజలు చేస్తున్న అరుణగౌడ్



బోనాల వేడుకల్లో పాల్గొన్న న్యూక్లబ్ ప్రతినిధులు





రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న నాగులూరి సాయిబాబా



బోనాల వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు మర్రి ఆదిత్యరెడ్డి





బన్సీలాల్‌పేట్‌లో అమ్మవారి ఫలహారపు బండి ఊరేగింపు

రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమిస్తే చర్యలు తప్పవు



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: కాలనీల్లో రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఒకటో వార్డు ఉమానగర్ కాలనీలో రూ.19 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన డ్రైనేజీ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీ పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానికులతో భేటీ అయ్యి వివిధ సమస్యలపై చర్చించారు. కాలనీలో కొందరు అంతర్గత రోడ్లను ఆక్రమించుకుని, రోడ్డుకు అడ్డుగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సీఈఓకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. వాహనాల పార్కింగ్‌కు సంబంధించి కాలనీలో సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని రామకృష్ణ సూచించారు. కాలనీ గుండా సంచారపురి కాలనీ మీదుగా వెళ్లే నాలాపై పార్కును నిర్మించినట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా, సీఈఓ మధుకర్ నాయక్‌తో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బానుక మల్లికార్జున్, బీఎస్ శ్రీనివాస్, బానాల శ్రీనివాస్ రెడ్డి, బద్రుద్దీన్, జోసెఫ్, మధుసూదన్ రావు, దిలావర్, ఫిరోజ్‌ఖాన్, శశికాంత్, జేవీఎస్ రావు పాల్గొన్నారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

విజయానంద తీర్థ స్వామి



పాదయాత్ర ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న విజయానంద తీర్థ స్వామి

రాంగోపాల్‌పేట్: గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించడంతో పాటు గో ఆధారిత ఉత్పత్తులను వినియోగించేలా ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీదత్త పీఠాధిపతి విజయానంద తీర్థ స్వామి అన్నారు. గోవును రక్షించండి–భూమిని కాపాడండి అనే నినాదంతో అఖిల భారత గో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలకిషన్ గురుస్వామి హైదరాబాద్ నుంచి తిరుపతి మీదుగా అరుణాచలం వరకు చేపట్టిన మహా పాదయాత్ర ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం వద్ద ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గోవుల గురించి రైతులకు తెలుసని ప్రజలకు కూడా మరింత తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు కూడా గో ఆధారిత వ్యవసాయం చేసినపుడు అందరి ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. ఇలాంటి మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం పట్ల ఆయన అభినందించారు. బాలకిషన్ గురుస్వామి మాట్లాడుతూ.. భూమి బాగుండాలంటే గోవు బాగుండాలని, భూమిపై ఎక్కడ 10 అడుగుల మేరకు సూక్ష్మపోషకాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోవును రక్షించుకునేందుకు ఈ పాదయాత్ర చేస్తున్నానని 18 ప్రాంతాల్లో గోవుకు సంబంధించిన అవగాహన సదస్సులు, రైతులతో సేంద్రీయ వ్యవసాయంపై సదస్సులు, సమావేశాలు ఉంటాయన్నారు.

రవాణా శాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయండి

బౌద్ధనగర్: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికై నిర్వహించనున్న రవాణా శాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం బౌద్ధనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆటో, మోటార్ రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత తొమ్మిది సంవత్సరాల ను ంచి వివిధ రూపాలలో నిరసనలు వ్యక్తం చేస్తున్నా ర వాణా శాఖ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. న్యాయవరమైన డిమాండ్ల పరిష్కారం కోసం 8న ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కమిషనర్ కార్యా లయ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా శ్రీగణేశ్ జన్మదిన వేడుకలు



అభిమానులతో కలిసి కేక్ కట్ చేస్తున్న శ్రీగణేశ్



శుభాకాంక్షలు తెలుపుతున్న క్రిశాంక్

కంటోన్మెంట్: బీఆర్ఎస్ సీనియర్ నేత నారాయణన్ శ్రీగణేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కంటోన్మెంట్ లీ ప్యాలెస్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ వేడుకలకు ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, సాద కేవవరెడ్డి, బోర్డు మాజీ సభ్యులు లోకనాథం, నళిని, శ్యామ్‌కుమార్, సీనియర్ నేతలు రంగ రవీందర్ గుప్తా, ఆకుల హరికృష్ణ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. శ్రీగణేశ్ జన్మదిన వేడుకల్లో క్రిశాంక్, గజ్జెల నాగేశ్ రావడంపై పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.63, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 55, పందిరి బీర 45, క్యాబేజీ 23, క్యారెట్ 45, దొండ 28, గుండుబీన్స్ 80, గింజ చిక్కుడు 75, గోకరకాయ 35, కీర 20, దోసకాయ 35, బీట్‌రూట్ 26, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 24, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 28, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

క్రైం కార్నర్..

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



అమరేందర్(ఫైల్)

బౌద్ధనగర్: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ వివరాల ప్రకారం.. జనగాం జిల్లా పాలకుర్తి మండలం రవేణు గ్రామానికి చెందిన లొంక అమరేందర్ (27) ఐదు నెలల క్రితం నగరానికి వచ్చి పార్శిగుట్ట ఎమ్‌సీహెచ్ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఇతని తల్లిదండ్రులు రెండేళ్ల క్రితం చనిపోయారు. సోదరుడు సైక్యాట్రిక్ పేషెంట్. నెల క్రితం అమరేందర్ అతని సోదరుడు అనిల్ కుమార్ తమ గ్రామానికి వెళ్లారు. అమరేందర్‌కు పచ్చకామర్లు రావడంతో పదిహేను రోజుల క్రితం ఒక్కడే తిరిగొచ్చాడు. మూడు రోజులుగా అమరేందర్ తలుపు తీయకపోవడంతో ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో ఇంటి యజమాని అతడి స్నేహితుడికి ఫోన్ చేసి విషయం చెప్పింది. ఆదివారం ఉదయం ఇంటికొచ్చిన అతని స్నేహితుడు ఎంతసేపు తలుపు కొట్టినా తీయకపోవడంతో బద్దలుగొట్టి లోపలికి వెళ్లి చూడగా అమరేందర్ మృతదేహం కుళ్లిపోయి ఉంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు అనారోగ్య సమస్యతో చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

బౌద్ధనగర్: అత్తింటి వేధింపులకు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ వివరాల ప్రకారం.. విద్యానగర్‌లోని రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన లక్ష్మి (35)ని వివిధ కారణాలతో అత్తింటి వారు వేధింపులకు గురి చేసేవారు. తీవ్ర మనోవేదనకు గురైన లక్ష్మి ఆదివారం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డు కాకూడదు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఆర్థిక సహాయ చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ చదువులను మధ్యలో ఆపొద్దని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని సంకేత్ సోషల్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చెక్కులను ఆదివారం మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా ఆర్థిక సహాయం అందించిన సంకేత్ నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు మరింతగా విస్తరించాలని, అందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సంకేత్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు వ్యక్తిగతంగా రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తానని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మనబస్తీ–మనబడి కార్యక్రమం కింద ప్రభుత్వం రూ.7,200 కోట్ల వ్యయంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఫర్నీచర్, మంచినీరు, విద్యుత్, టాయిలెట్స్ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ వైద్య సేవలనూ మరింత చేరువ చేసేందుకు ఎర్రగడ్డలో నూతనంగా వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, సంకేత్ సంస్థ అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.

ప్రతిఫలం ఆశించకుండా చేసేదే నిజమైన సేవ



నూతన సభ్యులతో శంకర్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: పేదలు, అట్టడుగు వర్గాలు, అవసరం ఉన్నవారికి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా చేసేది నిజమైన సేవ అని రోటరీ క్లబ్ డిస్ట్రిక్-3150 గవర్నర్ శంకర్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లోని బెల్సన్‌తాజ్ హోటల్‌లో ఆదివారం జరిగిన రోటరీ క్లబ్ అభ్యుదయ్ 3వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు తమ వ్యాపారాలు, ఉద్యోగాల్లో బిజీగా ఉన్నప్పటికీ తమలోని సేవాగుణంతో నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఇప్పటి వరకు డిస్ట్రిక్-3150 ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకులు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, దయాలసిస్ కేంద్రాలు, విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ, చిన్న పిల్లల గుండె ఆపరేషన్లు చేయించామన్నారు.క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రాము, బీఎస్ శరత్, కోశాధికారిగా రాజేష్‌తో పాటు వివిధ పదవులకు పద్మజ, రితిక, అంజు అగర్వాల్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఈ శరత్ చౌదరి, డీజీఎన్ రాంప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ మల్లికార్జున్ దీక్షిత్ పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత



చిన్నారితో కలిసి మొక్క నాటుతున్న క్రిశాంక్

రసూల్‌పురా: గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఆదివారం కంటోన్మెంట్ నియోజకవర్గం మూడో వార్డు ఏపీ టెక్స్‌బుక్ కాలనీలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కాలుష్యానికి వ్యతిరేకంగా మొక్కలు నాటుతూ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమం కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో ఓ ఉద్యమంలా కొనసాగుతోందని తెలిపారు. భావితరాల సంక్షేమం, ప్రకృతి పట్ల అవగాహన కోసం రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ ప్రారంభించిన ఈ బృహత్తర కార్యక్రమంతో మొక్కలను నాటడం అందరి బాధ్యతను గుర్తు చేస్తోందని అన్నారు. జగదీశ్వర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, వి.నర్సింహరావు, ప్రభాకర్, ప్రవీణ్‌గుప్తా, హేమ, రాజు, చంద్రశేఖర్, అనిల్ షా, సంతోష్ శ్రీమాల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేతలు

అడ్డగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారాలపై ప్రజలతో మమేకమై పోరాటం చేయాలని టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ దేవాలయ ఆవరణలో డివిజన్ అధ్యక్షుడు కాత విజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వల్లారపు శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికై అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. గతంలో టీడీపీ పార్టీకి పని చేసిన వారిని తిరిగి పార్టీలోకి వచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఈ నెల 23 నుంచి టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌రావు నిర్వహించనున్న బస్సు యాత్ర సికింద్రాబాద్ నియోజకవర్గంలోకి ప్రవేశించే సమయంలో చేపట్టాల్సిన విధివిధానాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో చందర్, సుదర్శన్‌రెడ్డి, నర్సింహ, గణేష్, నటరాజ్, రమేష్, జయప్రకాష్, నవీన్, ప్రసాద్, బాల్‌రాజ్, స్వామి పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

అమీర్‌పేట: మణిపూర్‌లో జరుగుతున్న ఆకృత్యాలు, అత్యాచారులను అదుపు చేసి శాంతిని నెలకొల్పాలని క్రైస్తవులు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు.జెకే కాలనీలోని బాప్టిస్ట్ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ సనత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న అన్ని చర్చిల మీదుగా ఎర్రగడ్డ సెయింట్ థెరిస్సా చర్చి వరకు సాగింది. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ.. క్రైస్తవులు శాంతి కాముకులని, దేశ క్షేమం కోసం ప్రార్థించే వారన్నారు. మణిపూర్‌లో క్రైస్తవులు, పాస్టర్లను హింసించడం, మందిరాలు కూల్చడం అమానుషమని మహిళలను అవమానించడం మరింత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కొలను బాల్‌రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు డి.డి.ప్రశాంత్, కెనడి, లారెన్స్, బాన కృపానందం, దయాకర్, ఫ్రాంక్లిన్, విలియమ్స్, శాంసన్ పాల్గొన్నారు.

సెంటినరీ బ్యాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో..

రాంగోపాల్‌పేట్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సికింద్రాబాద్ సెంటినరీ బ్యాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీని నిర్వహించారు. క్లాక్ టవర్ ప్రాంతంలోని చర్చి నుంచి మనోహర్ థియేటర్, మదర్ థెరిస్సా, సంగీత్ థియేటర్, సెయింట్ జాన్సన్ స్కూల్, వైఎంసీఏ మీదుగా చర్చి వరకు కొనసాగింది. పాస్టర్ పురుషోత్తం, చార్లెస్ థియేడర్, పాస్టర్ సత్యరంజన్, సంఘం అధ్యక్షులు క్యాలిస్టర్, ఉపాధ్యక్షులు విలియం పాల్, కార్యదర్శి జోసఫ్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు.

ప్రొ. జయశంకర్‌కు నివాళి



జయశంకర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో భాగస్వాములై, ఎందరో ఉద్యమకారులకు ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి ప్రొ. జయశంకర్ అని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా బోయిన్‌పల్లి జయనగర్ చౌరస్తాలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు.

డౌటన్‌బజార్ చౌరస్తాలో..

రసూల్‌పురా: ప్రొ.జయశంకర్ ఆశయాలు అనుసరణీయమని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు వి.జై ప్రకాష్ తెలిపారు. జయశంకర్ జయంతి సందర్భంగా ఆదివారం బొల్లారం డౌటన్‌బజార్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. బాల్‌రాజ్, మురళి యాదవ్, వినోద్ బాబు. సుభాష్ రెడ్డి, జగన్, మనోజ్, నరహరి పాల్గొన్నారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్ర సాధనే ఊపిరిగా బతికినా వ్యక్తి ప్రొ. జయశంకర్ అని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. ఆదివారం అడ్డగుట్టలో ప్రొ. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఓయూ పాలన భవనంలో..

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ చిత్రపటానికి ఓయూ ప్రొఫెసర్లు నివాళి అర్పించారు. ఆదివారం ఓయూ పాలన భవనంలో వీసీ ప్రొ.రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణతో పాటు ఇతర అధికారులు వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు.



జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జైప్రకాష్



ఓయూలో ..